




మూడుగంటలదాక బాగా ఎండ కాచింది.

ఉన్నట్లుండి మబ్బుకమ్మింది.

గాలికి తలుపులు కొట్టుకోవడంమొదలుపెట్టాయి.

"కింకర్మ కిమకర్మేతి కవయో ప్యత్ర మోహితా..." చదువుతున్న భగవద్గీతను మూసేసి కిటికీదగ్గరకెళ్లారు చెంచురామయ్య.

ఈ కిటికీతలుపు లిలా కొట్టుకోకుండా ఏదయినా పెట్టమంటే ఇల్లుగలావిడ పెట్టదుకదా! అద్దెకు మాత్రం మున్నైయవతారీకునే వచ్చి కూచుంటుంది ...కాస్త పెద్దగా గాలి వీస్తే చాలు, పర్వతాలు దొర్లిపోయినంత చప్పుడుచేస్తాయి తలుపులు......కిటికీతలుపుల సందుల్లో అట్ట ముక్కల్ని మడిచిపెట్టారు చెంచురామయ్య.

పెద్దగా వీచింది గాలి. కిటికీగుండా వానజల్లు ఆయన మొహంమీద పడింది. త్రుళ్లిపడ్డారు.

కిటికీ కవతల, రోడ్డుకటువైపున ఎవరో కంట్రాక్టరు కట్టించిన చిన్న చిన్న ఇళ్ళు బొమ్మరిళ్ళలా వరసగా ఎనిమిది వున్నాయి. ఆ ఏడో ఇల్లు

కనబడకుండా పెద్ద చింత చెట్టుంది. అది, గాలికి వూగి, వానకు తడిసి, మురిసిపోతూంది.....ఆ మొదటి ఇంట్లో అసిస్టెంట్ సర్జన్ మోహన్ రా వున్నాడు... నాలుగోదాంట్లో లాయర్ ఆంజనేయులుంటున్నాడు.....ఎంతమంది వుంటేనేం.—ఎం. ఎల్. ఏ. వరనన్నగౌడ్‌గారీవీధిలోకి కాపురానికి వచ్చేదాక, ఈ వీధి తారు మొహం ఎరగదుకద—

కిటికీకమ్మిల్ని పట్టుకుని నిల్చున్నారు చెంచు రామయ్య. ఇంకోసారి వాననీళ్ళు మొహంమీద పడ్డాయి. తుడుచుకున్నా రాయన.

ఆపాటికి వాన హెచ్చింది— వయస్సులా.... గాలి తగ్గింది—యవ్వనంలా....వానా, గాలీ కలిసి జోరుగావస్తే?— తుఫాను— అవుతుందేమో!!..... జీవితంలో ఏం కావాలో తెలియక వెతుక్కోవడంతో యవ్వనమంతా అయిపోతుంది. ఏమి కావాలో, ఏది చెయ్యాలో తెలుసుకునేసరికి సంవత్సరాలు దాటిపోతాయి—శక్తీ, ఓపికా తగ్గిపోతాయి....వాన వచ్చేముందు గాలి ఎక్కువ—గాలి తక్కువయిన కొద్దీ వాన ఎక్కువ — లెక్కల ప్రకారమయితే దీనికి ఏదయినా విలోమ నిష్పత్తిలాటిది వుండాలి....

చెంచురామయ్యగారి మనసు, బయటి వాతావరణంలా చల్లగావుంది......ఏవేవో వావీ వరుసా లేని ఆలోచనలతో వేడిగానూ వుంది—

రోడ్డు ప్రక్కగా వాన నీరు గలగలా చప్పుడు చేసుకుంటూ కాలువగా వెళ్తూంది....అంత వానలోనూ ఒకబ్బాయి పరుగెత్తుకొచ్చాడు.....వాడి కళ్ళల్లో ఎంత వెలుగో ..... ఒక కాగితప్పడవను నీళ్ళల్లో వదిలిపెట్టాడు— ఒయ్యారంగా ఊగుతూ సాగింది ఆ అబ్బాయి ఉత్సాహపుపడవ ..... కాని, పెద్దగా పడుతున్న వాన చినుకులకు తడిసి బరువెక్కి ఆ పడవ నెమ్మదిగా మునిగిపోయింది .... ఆ అబ్బాయి పరుగెత్తిపోయాడు ....

చెంచురామయ్య కిటికీని వదిలారు. హాల్లో అలమారలోంచి ఓ పాత ఇంగ్లీషు వార పత్రికను తీసి దాని అట్టకాగితాన్ని చింపారు. వాసలీన్ సీసానూ తీసుకున్నారు. ఆ కాగితాన్ని చతురస్రంగా కత్తిరించి దానికి రెండువైపులా వాసలీన్ పూశారు; నాలుగుగా మడిచారు. కత్తిపడవ చేయబోయారు— కాని రాలేదు. మూడుసార్లు ప్రయత్నించినా మామూలువడవే వచ్చింది... ఆయనకు నవ్వొచ్చింది. కత్తివడవ చేయడం మరిచిపోవడమా!

ఆఖరు సారిగా......

—ఒక వానరోజున బడి ఎగ్గొట్టి కాగితాలతో కత్తిపడవలు చేసి నీళ్ళల్లో విడిచి పెడుతుంటే, బయటినుంచి వస్తున్న నాన్నగారు చేతిలోని గొడుగుతోనే తన్ని కొట్టపోవడం, ఆ దెబ్బ కడ్డంగా తను మోకాలు పెడితే ఆగొడుగుకాడ విరిగిపోవడం—గుర్తుకొచ్చాయి......ఆరోజు బడి మానేసి వర్షంలో తడుస్తున్నాడని నాన్న కొట్టారు; తన రామకోటికాగితాలతో పడవలు చేశాడని అమ్మ చితకబాదింది.....

అప్పుడు తనకు ఎనిమిదేళ్ళు.

—నలభై ఏడేళ్ళ తర్వాత ఈనాడు పెళ్ళి, ఉద్యోగం, నల్గురిలో ఒక్కడుగా మిగిలిన కొడుక్కు రెండేళ్ళ క్రింద తమ ఇంటికొచ్చిన కోడలు, —తర్వాత ఈనాడు, ఈనాడు కత్తిపడవ చేయబోతే రానంటూంది—

ఆ అబ్బాయి మళ్ళీ వచ్చాడు. వంగి నెమ్మదిగా ఇంకో పడవను వదిలిపెట్టాడు.

...రవీంద్రుడి గీతంలో ఒక అమ్మాయి అంటుంది:

'ఇక్కడి కెందుకొచ్చానో చెప్పనా'?

'—నింగిని నిండిన నక్షత్రాల నడుమ నా ప్రమిదను నిలుపుదామని వచ్చాను—

'ఇక్కడి కెందుకొచ్చానో చెప్పనా?

—'పగటివెలుగు పడమటింటో నిద్రపోయింతర్వాత ఈ ప్రవాహంమీద నా దీపాన్ని పడవగా వదలిపెడదామని వచ్చాను—'

—ఈ ప్రవాహంమీద పడవగా వదలిపెడదామని వచ్చాను........—నా దీపాన్ని పడవగా వదలిపెడదామని.......—పడవగా వదిలి.....

చెంచురామయ్యగారు ఆశ్చర్యపడ్డారు,... ఆలోచిస్తూ, ఆలోచిస్తూ, ఎలా మడిచారో ఏమిటో —ఆయనచేతిలో కత్తిపడవ తయారయివుంది! పోగొట్టుకున్న వస్తువు దొరికినట్టు, పాత మిత్రుడు హఠాత్తుగా కనబడినట్టు ఆయన ఎద ఆనందంతో నిండింది. కిటికీదగ్గరకు వెళ్ళారు... వర్షం ఇందాకటికన్న కాస్త తగ్గింది. కాని నీళ్ళ కాలవమాత్రం మరీ ఉధృతంగా పారుతూంది.

> ముష్టివాడు:-అయ్యా! ఒక బీడీ ఉంటే ధర్మం చేద్దురూ.
>
> పెద్దమనిషి:-ముష్టి వాళ్లకు కూడా బీడీలు ధర్మమేమిట్రా.
>
> ముష్టివాడు:-బీడీలు గాక సిగరెట్లు ఎవరిస్తారండీ.
>
> తాడి రామమూర్తి (సఖి నేటిపల్లి)

దాన్నిండా నాలుగయిదు కాగితాలు తేలుతూ పోతున్నాయి— అవన్నీ ఆ అబ్బాయి వదిలిపెట్టిన పడవలు కాబోలు.....ఆ పడవల జీవితం రెండేసి నిముషాలు — రెండుబొట్లు వాన రాలితే ఆ అందాల పడవకాస్తా, తడిసి ముద్దఅయి మామూలు కాగితంగా తేలి, మునిగిపోతుంది. అడుగో ఆ అబ్బాయి —గెంతుకుంటూవచ్చి ఇంకో పడవను వదిలిపెట్టి పెరుగెత్తివెళ్ళిపోయాడు....బహుశ ఇంకోటి తేవడానికి కాబోలు—అలా ఎన్ని పడవలుచేసి దాచుకున్నాడో—!

ఈసారి ఆ అబ్బాయి రాగానే పిలవాలి. వాడినొక నిముషం వుండమనాలి. తాను వెళ్ళి, తను చేసిన కత్తిపడవను ఆ అబ్బాయిచేతికిచ్చి నీటి మీద వుంచమని చెప్పాలి. ఈ కత్తిపడవ అంత త్వరగా మునిగిపోదు. అలా మునగకుండా కంటికి కనిపించిన దూరందాక అది తేలిపోతుంది. అప్పుడు ఆ అబ్బాయి ఆశ్చర్యపోతాడు. ఆ ఆశ్చర్యాన్ని చూడాలి. ఆ కాగితానికి వాసలీన్ పూశారని తెలిస్తే వాడి ఆశ్చర్యం పోతుంది....రహస్యంలోనే ఆనందం.. ఆశ్చర్యం......! ఇదేమిటి—అని బయలుదేరితే ఆనందంపోతుంది.... బాధ మిగులుతుంది....అసంతృప్తి దొరుకుతుంది.

అదుగో, ఆ అబ్బాయి వచ్చేశాడు! వాడి పేరేవిటో?

"ఏయ్!" అని పిలిచారు చెంచురామయ్య. వాన జోరులో వాడికి వినిపించలేదల్లేవుంది. గొడుగు తీసుకున్నారు చెంచురామయ్య. ధోవతిని నడుములో దోపుకున్నారు. ఇంకో చేతితో కత్తిపడవను తీసుకున్నారు.

"ఏమండీ! ఎంత పిలిచినా టిఫినుకు రారేం ?"

ఉలిక్కిపడ్డారు చెంచురామయ్య—

"ఎక్కడికో బయలుదేరుతున్నట్లున్నారే—?" అంది ఉప్మా పళ్ళెంతో వచ్చిన సుందరమ్మ.

"అబ్బే........"

"ఆ చేతిలో ఏవిటీ—"

"అబ్బే....ఇదా...ఇది ఏమీలేదే సుందరం!"—అని నవ్వారు చెంచురామయ్య.

"అరి మీ అన్యాయమూ! ఏదో భగవద్గీత చదువుకుంటున్నారనుకుంటే—ఇదా మీరు చేస్తున్న పని?" — అని కిటికీగుండా బయటికి చూసి— "అవిగో అవన్నీ మీరుచేసిన పడవలేనా — ! రామ రామ! ఎవరయిన చూస్తే — నవ్వరుటండీ—" అని దవడలు నొక్కుకుంది సుందరమ్మ చిరునవ్వుతో.

"అబ్బే! అవన్నీ ఆ అబ్బాయి చేశాడే—" కత్తిపడవ టేబిల్‌మీది కెక్కింది.

"ఇహనేం? — మీరుచేసి ఇస్తుంటేవాడు వానలో నిల్చుని—వాటిని నీళ్ళల్లో వేస్తున్నాడన్నమాట—!! వాళ్ళమ్మ గనుక చూసిందంటే మనల్ని జుట్టు పట్టుకుని వీధిలోకి లాగుతుంది.....ఆ...."అని మందలించింది సుందరమ్మ.

"నేను ఉద్యోగంనుండి రిటైరయినా నువ్వు అధారిటీలోనుండి రిటైరవలేదే—" అన్నారు చెంచు రామయ్య.

"ఆ.....చాల్లెండి ... ముందు టిఫిన్ కానివ్వండి—"

"ఏవిటీ — ఉప్మావా......జంతికలు చెయ్యమన్నాను కదటే—"

"అబ్బాయి ఈ పూట ఉప్మా చెయ్యమని చెప్పిపోయాడండీ — అందుకని చేశానూ—అదీగాక ఓ ప్రక్క పళ్ళూడిపోతుంటే ఇంకా జంతికలేవిటండీ—"

"పళ్ళు పూర్తిగా వూడిపోతే ఇహ జంతిక లెటూ తినలేముగా—"

"ఏవిటో బాబూ—" సుందరమ్మ వెళ్ళిపోయింది వంటింట్లోకి—

'ఈమె ముప్ఫైయ్యైదేళ్ళు నా జీవితాన్ని పంచుకుంది' అనుకున్నారు చెంచురామయ్య

ఆయన ఆలోచనలకు టేబిల్‌మీది కత్తిపడవ అడ్డమయింది. ఉప్మా అయిపోవస్తూంది.

"ఇంకాస్త తెచ్చాను — " అంటూ వచ్చింది సుందరమ్మ.

"నాకింక వద్దు—"

"అయితే వుండండి, కాఫీ పట్టుకొస్తాను"

మళ్ళీ ఆలోచనలో పడ్డారాయన

—పెండువారాల క్రింద కొడుకు భార్యతో అత్త గారింటికి వెళ్ళాడు. అతడు వెళ్ళిన నాల్గో రోజు పొద్దున—

నిద్రలేచి, స్నానం అదీ అవగానే పూజ కానిచ్చారు చెంచురామయ్య. పూజకాగానే భగవద్గీత ఒక అధ్యాయం పారాయణం చెయ్యడం ఆయన అలవాటు. భగవద్గీత చదువుతూ వుండగానే ఇత్తడి గ్లాసులో వేడివేడి కాఫీని తీసుకొచ్చి ఆయన ముందుంచి, ఆ గ్లాసుమీద ఇత్తడికప్పుని బోర్లించి పెట్టి వెళ్ళడం సుందరమ్మ అలవాటు

కాని అవాళ ఎందుకనో గీతాపారాయణం అయిపోతూంది ఇంకా రెండే శ్లోకాలున్నాయి. కాని కాఫీ గ్లాసు రాలేదు ఆ రెండు శ్లోకాలూ అయిపోయాయి. కాని . . .

సుందరమ్మ ఆరోగ్యమేమయినా బాగులేదేమో అనుకుని, లేచి, వంటింట్లోకి వెళ్ళిచూశారాయన. ఆ పాటికి ఆమె స్నానం అయింది కూచుని కూరలు తరుగుతూంది .ఆయన్ను చూడగానే కత్తిపీటను ప్రక్కకుంచి—"కూచోండి!—కాఫీ ఇస్తాను" అంది ఇచ్చింది. ఆయన త్రాగారు. ఏదో అడుగుదామని అడక్కుండానే లేచివచ్చారు.

కాసేపు పేపరు చదివి, ఒకటి రెండుత్తరాలు రాసుకుని ప్రక్కింటబ్బాయి ముకుందానికేదో అర్థం కాని పాఠం చెబుతుండగా తొమ్మిది కొట్టింది. విస్తుపోయారు చెంచురామయ్య తొమ్మిది కొడుతుండగా చారు లేక మజ్జిగ అన్నం ఘట్టంలో వుండడం ఆయన రివాజు. కాని ఏమిటివాళ..? సుందరమ్మకేమయిన మతిపోతూందా ?....ముప్పై ఆరేళ్ళ సర్వీసులో ఒక్క రోజు కూడా ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళలేదే — అలాటి తను ఇవాళ ఆలస్యంగా వెళ్ళడమా? ఇంటినుండి సరిగ్గా తొమ్మిదీ పదింటికి బయట పడకపోతే ఆఫీసువేళ దాటిపోతుంది......ఇవాళ భోజనానికి పిలులేదు

చెంచురామయ్యగారు గబగబా ధోవతి ధరించి, చొక్కా వేసుకుని కోటు తొడుక్కున్నారు. కోటు జేబులో పెన్ను అదీ చూసుకున్నారు. ఉత్తరీయం వేసుకుంటుండగా హాలుని చిమ్ముదామని అటొచ్చింది సుందరమ్మ. చేతిలో చీపురుతో ఆమె అలాగే నిల్చుండిపోయి తన్ను చూడడం గమనించారు చెంచురామయ్య

ఆశ్చర్యంగా ఆమెవేపు చూశారు—

ఆమె చేతిలోని చీపురు అరిగిపోయి వుంది....

"ఆ చీపురు అరిగిపోయిందికదా—పారేసి కొత్తది కొనుక్కోకూడదూ—" అన్నారు యధాలాపంగా కోటుజేబులో చేయివుంచుతూ

చేతికేదో లావు కాగితం తగిలితే బయటికి తీశారు సుందరమ్మ మాట్లాడలేదు

తీసిన కాగితాన్ని విప్పారు చెంచురామయ్య. మరుక్షణం ఎవరో కత్తితో పొడిచినట్లయింది ఆయన మొహం!

అందుకనేనన్నమాట—కాఫీ ఆలస్యమయింది.

అందుకనేనన్నమాట — తొమ్మిదికి ముందుగానే తనకు భోజనానికి పిలుపురానిది . సుందరమ్మ లోపలికి వెళ్ళిపోయింది

ఉత్తరీయమూ, కోటూ, చొక్కా, విప్పిపారేసి పడక కుర్చీలో చేరగిలబడ్డారు చెంచురామయ్య.

ముప్పై ఆరేళ్ళ ఆదర్శప్రాయమైన ఉద్యోగ నిర్వహణ తర్వాత తను నిన్నటితో రిటైరయిపోయారు! అరిగిపోయిన హెడ్ గుమాస్తాకు ఇవాళ ఆఫీసులో పార్టీ కూడా ఏర్పాటుచేశారు..... చెంచురామయ్యగారి మొహంమీదకు చిరునవ్వు రావడానికి, ఆయన యాభైయ్యైదేళ్ళ జీవితానుభవమూ కృషిచేయవలసివచ్చిం దారోజున......

—పది రోజుల క్రింది ఆ సంఘటన తలచుకుంటే ఏవిటోగా వుంటుంది.....

ఉప్మా అయిపోయింది. పళ్లెం ప్రక్కనుంచారు. వర్షం ఇంకా కురుస్తూనేవుంది. అంత ఉరుముల శబ్దం మధ్యా — వీధితలుపు ఎవరో కొడుతున్నట్లు వినిపించింది. చెంచురామయ్య వెళ్ళి తలుపుతీశారు. రెయిన్‌కోటూ, కుళ్ళాయికింది మొహం పలికింది—" టెలిగ్రాం సార్!"

పుచ్చుకున్నారు చెంచురామయ్య.

తనకే! ప్రాణ మిత్రులలో ఒక్కడైన సూర్యనారాయణకు టైఫాయిడ్ తగ్గిపోయి—మళ్ళీ తిరగ

---

దర్శకుడు:- అరే! హీరో వేషం నీ కిస్తే నువ్విలా నున్నగా గుండు గీయించుకొచ్చావేమోయ్?

కొత్త నటుడు:- సార్! హీరోఛాన్సు యిప్పిస్తే ఏడుకొండలవాడికి తల దీయించుకుంటానని మొక్కుకున్నానండి.

యన్. వి. శ్యశ్వర్ (వైజాగ్)

---

బెట్టిందట.....తన్ని చూడాలని అంటున్నాడట.... వాళ్ళబ్బాయి ప్రసాద్ ఇచ్చాడు ఈ టెలిగ్రాం—

కాఫీగ్లాసుతో వచ్చిన సుందరమ్మకు టెలిగ్రాముతో ఎదురయ్యారు చెంచురామయ్య.

* * *

ఇంకో నాలుగ్గంటలుంటే తెల్లవారుతుంది.

మెయిలుబండి చీకటిని దూసుకుని వెడుతూంది.

ఫస్ట్‌క్లాస్ పెట్టెలో క్రింది పరుపుమీద పడుకుని ఉన్నారు. ఆ పెట్టెలో రెండే పరుపులున్నాయి. పైదానిమీద ఎవడో అబ్బాయి—కాలేజి కుర్రాడు కాబోలు—పండుకుని వున్నాడు. నీలిదీపం ప్రశాంతంగా వెలుగుతూంది.

సూర్యనారాయణ—అదే సూర్యం—ఆ పేకాట దుర్గుణం మినహాయిస్తే ఎంత మంచివాడు.... హైస్కూలు రోజులలో ఓసారి తాను ఈదుతూ ఈదుతూ మునిగిపోతుంటే జుట్టుపట్టి పైకి లాక్కువచ్చాడు సూర్యం....మొన్నమొన్న అబ్బాయి పెళ్ళికి డబ్బు ఎలాతేవాలో తెలియక తికమకపడుతుంటే అడక్కుండానే డబ్బు పంపాడు సూర్యం. . ఆ వెయ్యిలో ఇంకో మూడువందలు ఇవ్వాలికూడాను.... .నిడదవోలులో సూర్యం మేష్టారంటే ఆయన దగ్గర చదువుకున్నవాళ్ళంతా పడిఛస్తారు..... ఆ సూర్యం తను వెళ్ళేసరికి వుంటాడా? ఏవిటో ఇన్ని అనుభవాల తర్వాత, ఇన్ని సంవత్సరాల తర్వాత ఇంకా 'చావు' అనగానే గభుక్కున గుండె ఎగిరిపోయినట్లనిపిస్తుంది....కాని రోజూ ఎంతోమంది చచ్చిపోతుంటే అలా అన్పించదు. బహుశా మనం ప్రేమించిన వాళ్ళు—కనీసం ప్రేమించామనుకున్న వాళ్ళు — మనం అలవాటుపడ్డవాళ్ళు చనిపోతేనే ఈలోటు, ఈ బాధ కలుగుతాయి కాబోలు — అయితే 'చావు' అంటే మనం పడే వేదనకు కారణం, కేవలం 'అలవాటుపడి వుండడ'మేనా ? ఛా..... అంత సూక్ష్మంగా తేలిపోతే ఇహ రిసరెక్షన్లూ, త్రిపిటకాలూ, కర్మయోగాలూ ఎందుకూ? కాని చావంటే ఏవిటో, దాని తర్వాత ఏంవుందో (అదంటూ వుంటే) తెలిస్తే చావు గురించి భయపడమేమో!...అయితే చావుమీది మన భయానికి మరో పేరు — ఏమిటో తెలియని అజ్ఞానపు భయమన్న మాట—ఇదీ ఒక నిర్వచనమే?—

"ఇదేం స్టేషను మేస్టారూ?"

చెంచురామయ్య ఉలిక్కిపడ్డారు. పైనుండి ఆ అబ్బాయి అడిగినట్లు తెలుసుకున్నారు. తెలుసుకుని ఆశ్చర్యపోయారు. అసలు రైలుబండి ఆగినట్లే తెలియదు తనకు—

"తెలీదు నాయనా!" అన్నారు ఏదో నేరం చేసినవాడిలా

ఆ అబ్బాయి లైటు వెలిగించాడు.. తలుపు గడియమీద ఓపాదం వుంచి క్రిందకు దూకాడు లాఘవంగా—

'అలా నేను దూకగలనా ?...దూకినా ఆ అబ్బాయి నవ్వుతాడేమో' — అనుకుంటున్న చెంచురామయ్యకు ఆ అబ్బాయి పెట్టె దిగి క్రిందకు వెళ్ళడం తెలియలేదు.

కాస్సేపు తర్వాత ఆ అబ్బాయే వచ్చి చెప్పాడు— "మేష్టారూ! మన ముందు వెళ్ళిన గూడ్సుబండి విజయవాడకు మూడుమైళ్ళలో పడిపోయిందిట— అంచేత మనబండి నింకో పది పన్నెండు ఘంటల దాక ఇక్కడే వుంచుతారట—" అన్నాడు సిగరెట్టు ముట్టిస్తూ—

"ఇక్కడే—అంటే?"

"మనం మంచిపల్లి స్టేషనుకు కాస్త ఇవతల వున్నామండీ—" అన్నాడు ఆ అబ్బాయి....

ఆ తర్వాత అరఘంటలో—ఆ అబ్బాయి—గోపీనాథ్ ఆయనతో ఎన్నో కబుర్లు చెప్పాడు. ఎన్నో విషయాలు చర్చించాడు

ఆఫీసులో ఏ కేసుల విషయమో తప్పిస్తే గోపీనాథ్ వయసువాళ్ళిలా తనతో కూర్చుని మాట్లాడ్డం చెంచురామయ్య ఎరగరు. బీటలు వారిన భూమిమీద వర్షపుజల్లు పడ్డట్లుంది....

ఉన్నట్లుండి గోపీ పలికాడు — "మేష్టారూ! ఎటూ ఈ బండి చాలాసే పిక్కడే వుంటుందికదా దిగి అలా వెళ్ళొద్దాం! రారాదాండీ—"

(81 వ పేజీ చూడండి)

# మూసిన తలుపులు

(11-వ పేజీ తరువాయి)

చెంచురామయ్యగారి హృదయం ఎగిరి గంతేసింది ఆయన అతి ఉత్సాహంతో ఆ పెట్టెనుండి క్రిందకు దూకారు గార్డుతోచెప్పి తమ పెట్టెకు తాళం వేయించారు దూరంగా కనపడుతున్న గుట్టవైపు నడిచారు. ఆ పాటికి తెల్లవారు ఝామయింది

అరమైలు నడిచేసరికి పెద్దతోట వచ్చింది దానిగుండా నడిచారు జోళ్ళక్రింద నలుగుతున్న ఆకుల చప్పుడుకు పక్షులు అలజడితో కదిలాయి—

“చెప్పులు తీసేసి నడుద్దామండీ—” అన్నాడు గోపీ

“ఈ ఒక్కపూట మాత్రం పక్షులు కాస్త త్వరగా నిద్రమేల్కొనీయవోయ్ . ఏమీ ఫరవాలేదు—” అన్నారు చెంచురామయ్య గోపీ నవ్వాడు

మూడు ఫర్లాంగుల తర్వాత ఒక పెద్ద చెరువు కనపడింది నెమ్మదిగా పారుతున్న ఆ అలలు ఏదో రహస్యం చెబుతున్న పెదవులనిపించాయి.

చెంచురామయ్య మాట్లాడకుండా చొక్కా విప్పేసి అందులోకి గెంతారు చొక్కానూ పంట్లామ్నీ ప్రక్కకుంచి, గోపీ ఆయనను అనుసరించాడు ఇద్దరూ ఈ దారు నీళ్ళు చల్లుకున్నారు మునిగారు ఆడుకున్నారు తేలారు నవ్వుకున్నారు .. బయటికి వచ్చారు బట్టలు పిండి ఆరవేశారు ..

ప్రక్కనే చిన్న ఆలయముంటే వెళ్ళారు. అందులో ఏదో గ్రామదేవత విగ్రహంలా వుంది. ఆరిపోతున్న దీపం వెలుగులో, పుట్టెడు కుంకుమ క్రింద సరిగా కనపళ్లేదు ఆ కుంకుమ కొంచెం నొసట దిద్దుకుని, నమస్కారం పెట్టి గుడిని వదిలారు

అయిదు గంటలవుతూంది బయటికివచ్చి, తోటలో పండ్లచెట్లున్నవేపు వెళ్ళారు ఇద్దరూ కలిసి రాళ్ళు విసిరి నేరేడు, జామ, మామిడి పళ్ళను కొన్నింటిని రాల్చారు

పెద్ద ఆకులేవోతెచ్చి కడిగిన పండ్లను వాటిలో వుంచుతూ అడిగాడు గోపీ—“ఏమండీ ఈ తోట యజమాని ఎవరయినా ”

ఫరవాలేదోయ్ ” అన్నారాయన నవ్వుతూ

బట్టలు తడి ఆరాయి చల్లగా బయలుదేరింది, గాలి

చెంచురామయ్యగారి తెల్ల జుత్తు అల్లరిగా ఎగురుతూంది చేతులతోనే క్రాపుని సరిచేసుకుంటున్నాడు గోపీ

అతడిని ఎగతాళిచేశారాయన . “దేవతలు విహరించే ఈ వేళప్పుడు తల్లి ఒడిలాటి ఈ చోట కూడా, ఆ క్రాపుమీదేనా నీ దృష్టి? . నీ క్రాపు కాస్త వంకరగా వున్నంత మాత్రాన ఈ భూగోళం క్రుంగిపోటకదా—!”

“నిజమేనండోయ్ ” అని, కావాలని జుత్తంతా రేపేసుకున్నాడు గోపీ

“అబ్బా!” అని పెద్దగానవ్వి గోపీ వీపుమీద ఒక్కటి చరిచారు చెంచురామయ్య

గభుక్కునలేచి నిల్చున్నాడు గోపీ “మేష్టారూ! మీ రిక్కడే వుండండి నేను అయిదే నిముషాల్లో పరుగెత్తుకెళ్ళి అదిగో ఆ గ్రామంలో ఇంత పాలూ అదీ దొరికితే పట్టుకొస్తాను నిప్పుచేసి దాన్ని కాచుకుందాం . చక్కగా పండ్లనూ వేడిపాలనూ ఆరగిద్దాం—” అన్నాడు ఉత్సాహంతో పంట్లాం తొడుక్కున్నాడు—“నేను వచ్చేలోగా మీకు పూనుపోకపోతే ఈ పుస్తకం చూస్తూవుండండి” అని పంట్లాం జేబులోనుండి ఓ ఇంగ్లీషు పుస్తకాన్ని బయట పడేశాడు

“అబ్బాయ్, అసలే నీ పేరు గోపీనాథుడూ, అంచేతా—పల్లెసీమల్లో గొల్లభామలుంటాయి జాగ్రత్త—” అని నవ్వారు చెంచు రామయ్య. మాట్లాడకుండా చిరునవ్వుతో అడుగులు త్వరగా వేశాడు గోపీ

లేచివెళ్ళి కొన్ని చితుక పుల్లలూ అవీ ఏరుకొచ్చారు చెంచురామయ్య ఈ పాటికి బాగా తెల్లవారిపోయింది

---

సినిమా జరుగుతోంది. హీరో భక్తి శ్రద్ధలతో దేవుణ్ణి ప్రార్థించాడు. దేవుడు ప్రత్యక్షమై నాయనా! నీకేమి కావాలి? కోరుకో!” అన్నాడు. ఇంతలో తపీమని వొక ప్రేక్షకుడు లేచి, బాబ్బాబు! నీకు పుణ్యముంటుందిగాని, యీ సినిమా హాలులోని కుర్చీలలో నల్లులు మాయమయ్యేటట్లు వరంకోరు!” అన్నాడు.

డి.యస్. రామబ్రహ్మం (రాజమండ్రి)

---

ఆకాశంమీది ఉషాదేవి భూమ్మీది ఆ చెరువుటద్దంలో తన ఎర్రదనం చూచుకుంటూంది పక్షులన్నీ గానాలతో స్నానాలు మొదలెట్టాయి. చూపు ఆనిన చోటెల్లా కనపడని చేతులు రంగురంగుల ముగ్గుల్ని దిద్దుతున్నాయి శబ్దాని కతీతమయిన సంగీతం సాకారమై ప్రత్యక్షమయింది

చెంచురామయ్య హృదయం నిండిపోయింది

“నతుమాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా—” విశ్వ రూప సందర్శన యోగంలో కృష్ణ భగవానుడు చెప్పిన బలహీనత విస్పష్టమయింది.

కళ్ళు మూసుకుని చేతులు జోడించారొక్క క్షణం

ఏదో పండు ‘ధప్పు’ మని ఆయన ప్రక్కన పడింది ఉలిక్కిపడి కళ్ళు తెరిచి పైకి చూస్తే— ఎగిరిపోతున్న చిలుక కన్పించింది

రాత్రిసుందరి వదలిన ఆనంద బాష్పం లాటి మంచుకణం అంతవరకూ గడ్డిపోచ చివర నాట్యంచేసి నేలమీద రాలింది.

‘ఈపాటికి గోపీ వస్తూ వుండాలి’ అనుకుంటూ అతడు విడిచి వెళ్ళిన పుస్తకాన్ని తిరగేశారు చెంచు రామయ్య పుస్తకం వెనక అట్టమీద రచయిత జీవిత విశేషా లున్నాయి చూస్తున్నారు

ఉన్నట్లుండి పుస్తకం మధ్యనుండి ఒక కవరు క్రిందపడింది. దాన్నితీసి గోపీ అడ్రసు చూశారు చెంచురామయ్య

ఆచేతిరాత చాల పరిచయమయినదిగా కన్పించింది కవరుని తిప్పిచూశారు తన కళ్ళను నమ్మలేకపోయారు . కవరు వెనక తన కొడుకుపేరు— తమ ఇంటి అడ్రసు ఉంది—

అయితే—గోపీ తన పుత్రుడి మిత్రుడన్నమాట.— తానింతసేపూ—?!!

లేచి నిల్చున్నారు చెంచురామయ్య. ఒక్కసారి, దూరంగా కన్పిస్తున్న ఆ పల్లెనూ, చెరువునూ, చిన్న ఆలయాన్నీ, తోటనూ—పరికించారు.

చేతిలో పుస్తకం తీసుకున్నారు. గబగబ నడవడం మొదలెట్టారు

తోటదాటి బయటికి వచ్చారు.

కాసేపట్లో—ఇంకా ఆగివున్న రైలుబండి దగ్గర కొచ్చారు

ఆ పాటికి, రాత్రి అక్కడ రైలు ఆగిన విషయం తెలిసిన చుట్టు ప్రక్కల పల్లెల జనం వచ్చారు కొందరేవో ముంజెలు, రేగుపళ్ళు వగైరా తెచ్చి అమ్ముతున్నారు ఒకటి రెండు ఎద్దు బండ్లు కూడా కన్పించాయి ప్రాంతమంతా చిన్న సంతలా వుంది

ఒక ఎద్దుబండిని కేకేశారు చెంచురామయ్య.

“దగ్గర్లో బస్సు దొరికేవూ రేదయినావుందా? అని అడిగారు

“ఏడు మైళ్ళలో ఉందండి” అన్నాడు బండివాడు

“బండి కడతావా?”

“అయిదు రూపాయలవుద్దండి!”

—గార్డుని పిలిచి తమ పెట్టెను తెరిపించారు చెంచురామయ్య. తమ ట్రంకునీ, పరుపు చుట్టనూ తీసుకొమ్మని బండివాడితో చెప్పారు

ఓ కాగితం తీసుకుని రాశారు—

‘గోపీనాథ్! అర్ధరాత్రివేళ—అజ్ఞానంతో
ఎత్తయిన గోడలు ఎగరడానికి ప్రయత్నించాను.
కాని చీకటిపోయి తెల్లవారింది తలుపులు
మూయబడిన తర్వాత, గోడలు దాట
బూనడం సరైన పనికాదని తెలిసి వచ్చింది
పగటి వెలుతురులో పదిమంది తోటి
పడుచువారిమధ్య—నువ్వు—నన్ను
ఇంకోవిధంగా చూసి, నాతో మరో విధంగా
ప్రవర్తించడం సంభవం, అది సహజం కూడా.
కాని ఈ గాజు కల పగిలిపోవడాన్ని
చూసి భరించగల శక్తి నాలోలేదు—నీ
వయసుతో భాగం పంచుకోగలిగిన ఆ
మూడుగంటలనే పదివేలుగా దాచుకుం
టాను ఈ నా కలను నీతోనే
వుంచుకొమ్మని కోరుతున్నాను—చెంచు రామయ్య

ఆ ఉత్తరాన్ని క్రింది పరుపుమీదవుంచి దాని, మీద గోపీ ఇచ్చిన ఇంగ్లీషు పుస్తకాన్ని పెట్టారు

క్రిందకుదిగి, గార్డుతో, ఆ పెట్టెకు తాళము వేసుకొమ్మన్నారు

—“మిమ్మల్ని ఎనిమిది గంటల బస్సు కందిస్తాను దొరా! ఏమీ భయంలేదు—” అని అభయ హస్తం ఇచ్చాడు బండివాడు

చెంచురామయ్యగారి నవ్వు ఎద్దు మువ్వలతో కలిసిపోయింది.